

ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీ శారీస్, బెంగాల్ కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్ డిజైనర్ బ్లౌజ్, లక్నో చికెన్, బనారస్‌శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్, ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శన ను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్నివర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9గంటల వరకు మరో మూడు రోజుల వరకు కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.



బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో రైతు భరోసా వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

రైతు భరోసా సర్వేను పరిశీలించిన ఆర్డీవో

సరూర్‌నగర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 26వ తేదీ నుంచి అమలులోకి రానున్న రైతు భరోసాకు రైతుల ఎంపిక ప్రక్రియ మొదలైన సంగతి తెలిసిందే. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, గూగుల్ మ్యాపుల ఆధారంగా సాగు భూములను గుర్తించి అర్హులైన రైతులను ఎంపిక చేస్తున్నారు. ఈ క్రమంలో బాలాపూర్ మండలంలో జరుగుతున్న సర్వే తీరును కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సర్వే వివరాలను తెలుసుకున్నారు. ఎక్కడా కూడా అక్రమాలకు తావు లేకుండా అర్హులను ఎంపిక చేయాలని, సాగుకు పనికి రాని భూములకు రైతుభరోసా ఇచ్చే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇందిరాదేవి, డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై పోరాటం చేయాలి

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఐక్యమత్యంతో పెన్షనర్ల సమస్యలపై పోరాటం చేసి, రావాల్సిన బకాయిలను సాధించుకోవాలని ఆల్‌ఇండియా రాష్ట్ర పెన్షనర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి డి.సుధాకర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం చైతన్యపురి సాయినగర్ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ భవనంలో నిర్వహించిన 2025-డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమైన దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు అసోసియేషన్, జాయింట్ యాక్షన్ కమిటీలు ఏకతాటితో కృషి చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ కె.లక్ష్మయ్య, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మహిళా పెన్షనర్స్ ఫోరమ్ అధ్యక్షురాలు ఆర్.ఉమాదేవి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భరత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఓంప్రకాష్ యాదవ్, గౌరవ అధ్యక్షుడు మదన్‌మోహన్ రావు, కోశాధికారి ఎం.కృష్ణమూర్తి పాల్గొన్నారు.



కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయాన్ని దర్శించుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు

హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

చంపాపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయాన్ని శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు వేద పండితులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలోని వినాయక, ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే పుట్టిన రోజును పురస్కరించుకొని ఆలయ వేదపండితులు, అర్చకులు ఆయనకు ఆశీర్వచనం అందించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే భక్తులకు పులిహోర ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, మాజీ ధర్మకర్తలు బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తా, నాయకులు బట్టు కిషన్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, నర్సింహ, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న జేటీసీ చిదుర రమేష్

డ్రైవర్లు దృష్టిలోపం రాకుండా చూసుకోవాలి

మన్సూరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరికీ కంటిచూపు ఎంతో ముఖ్యమని, దృష్టిలోపం రాకుండా ప్రతి డ్రైవర్ ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ చిదుర రమేష్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా శనివారం నాగోల్‌లోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ డ్రైవింగ్ పరీక్ష విధాన ప్రాంగణం కార్యాలయంలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐ-కేర్ గ్రూప్ ఆఫ్ హాస్పటల్స్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా జేటీసీ రమేష్ విచ్చేసి నాగోల్ ఇన్‌చార్జి ఆర్టీఓ అమర్‌నాథ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతలో భాగంగా ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నియమనిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు అనితారెడ్డి, విష్ణుదీపక్, శీతల్, కమల్‌కాంత్, శ్రీధర్, జ్ఞానేశ్వర్, మినిస్ట్రియల్ సిబ్బంది, ఐ-కేర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చలో జీహెచ్‌ఎంసీ ధర్నా కరపత్రం ఆవిష్కరణ

చంపాపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం చౌరస్తాలో శనివారం జీహెచ్‌ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య ఆధ్వర్యంలో ఈనెల 22న చలో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నా కార్యక్రమం కరపత్రాన్ని కార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీను, భాగ్యమ్మ, లక్ష్మి, రేణుక, ముత్తమ్మ, చంద్రమ్మ, ముత్యాలమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.



పనామా చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న టీడీపీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి వెంకట్‌గాంధీ, ప్రీతమ్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు



పనామా చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు తదితరులు



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవిరెడ్డి ప్రీతమ్‌రెడ్డి, చిత్రంలో చిత్తలూరి వెంకటేశ్వర్లు, పార్నపు శ్రీధర్ తదతరులు

యుగ పురుషుడు ఎన్టీఆర్

- కొనియాడిన పలువురు నేతలు - మాజీ సీఎంకు ఘన నివాళి



అబ్దుల్లాపూర్‌మెట్‌లో నివాళులర్పిస్తున్న అభిమానులు, టీడీపీ నాయకులు

మన్సూరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సినీ నటుడిగా, రాజకీయ నాయకుడిగా తెలుగు ప్రజలేకాకుండా దేశ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న యుగ పురుషుడు నందమూరి తారకరామారావు అని పలువురు వక్తలు, వివిధ పార్టీల నాయకులు కొనియాడారు. అన్ని సామాజిక వర్గాలకు రాజకీయాల్లో అవకాశం కల్పించి దేశ, రాష్ట్ర రాజకీయాల్లో సమూల మార్పును తీసుకువచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. నందమూరి తారకరామారావు 29వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఎల్బీనగర్, మహేశ్వరం, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలోని పలు చోట్ల ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు, అనాథలు, ఆస్పత్రిలోని రోగులకు అన్నదానాలు చేయడంతో పాటు పండ్లు పంపిణీ చేశారు.

లింగోజీగూడ సాయినగర్‌కాలనీలో..

లింగోజీగూడ డివిజన్ సాయినగర్ కాలనీలో మాజీ కౌన్సిలర్ చిత్తలూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తనయుడు దేవిరెడ్డి ప్రీతమ్‌రెడ్డి విచ్చేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ పేరుమీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పార్నపు శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాకేష్, శేఖర్, సుధాకర్, పార్వతి, లక్ష్మి, దుర్గ, నరేష్, శ్రీనివాస్, ఆనంద్, శోభారాణి, దేవి, సుజిత్, రుద్రాల శ్రీనివాస్, బొంబాయి, అశోక్, సరళ, అనూష పాల్గొన్నారు.

పనామా చౌరస్తాలో..

వనస్థలిపురం : ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాల ని టీడీపీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి వెంకట్‌గాంధీ అన్నారు. దివంగత సీఎం, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా వనస్థలిపురం పనామా చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి వెంకట్‌గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై టీడీపీ వనస్థలిపురం అధ్యక్షుడు వెలగ చంద్రశేఖర్‌తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తనయుడు ప్రీతమ్‌రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు, కమ్మసంఘం నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

హయత్‌నగర్ : మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం హయత్‌నగర్ మండల కేంద్రంలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ మల్కాజిగిరి అడ్‌హక్ కమిటీ సభ్యుడు సింగిరెడ్డి మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు మరాటి భిక్షపతి, మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు దుర్గం మల్లేష్‌యాదవ్, ఎల్బీనగర్ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాటెపాక ప్రవీణ్, సీనియర్ నాయకులు బాత్కుల శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, కుమార్‌యాదవ్, జెనిగే మహేందర్, సామ జాన్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, రమేష్‌గౌడ్, సాహితి, శివానాయక్, రాజునాయక్, వినోద్‌నాయక్, జనార్దన్ పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాటిపల్లి వెంకటేష్ గౌడ్, దాసుగౌడ్, ప్రవీణ్‌గౌడ్, దర్శన్‌గౌడ్, సతీష్‌గౌడ్, రాజులింగంగౌడ్, నారం బాబుగౌడ్, శంకర్‌గౌడ్, దశరథగౌడ్, రమేష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



హయత్‌నగర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న టీడీపీ నాయకులు, అభిమానులు

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌ను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ సద్గురునగర్‌కు చెందిన కె.కైలాస్, శ్రీరామ్‌నగర్‌కు చెందిన శక్తి రోహన్, వనస్థలిపురానికి చెందిన లక్ష్మమ్మలు అనారోగ్యంతో పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సకు అధిక మొత్తంలో ఖర్చు అయ్యింది. దీంతో కాంగ్రెస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహయాదవ్‌ను సంప్రదించగా టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన చెక్కులను శనివారం బాధితులకు మధుయాష్కీగౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహయాదవ్, కొండోజు శ్రీనివాస్, నరేష్, మధుసూదన్‌రెడ్డి, దుర్గేష్ పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మధుయాష్కీగౌడ్

సంస్కృతం అన్ని భాషలకు జననీ

చాదర్‌ఘాట్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్‌తోపాటు ప్రపంచంలోని 28దేశాల్లో, అమెరికాలోని 39రాష్ట్రాల్లో కార్యకర్తలు నడుపుతున్న కార్యాలయాలు కలిగిన సంస్కృత భారతి 3 సంవత్సరాలకు ఒక సారి జరుపుకునే ప్రాంతీయ సమ్మేళనం శనివారం మూసారాంబాగ్‌లోని అరోరా పోస్ట్ గ్రాడ్యూయేట్ కళాశాలలో ప్రారంభమైంది. శనివారం నుంచి రెండు రోజుల పాటు తెలంగాణ సంస్కృత భారతి ఆధ్వర్యంలో జరుగుతున్న 5వ ప్రాంతీయ సంస్కృత సమ్మేళనాన్ని పరమహంసపరివ్రాజకాచార్యులు మధవానందసరస్వతిస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ సంస్కృతం అన్ని భాషలకు జననీ అని, భారతీయులందరు సంస్కృత భాషను నేర్చుకోవాలన్నారు. సమ్మేళానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన అమెరికా సంస్కృత భారతి అధ్యక్షుడు నటేశ జానకిరామన్ అమెరికా దేశంలో సంస్కృత భాషా ప్రచారం జరుగుతున్న తీరు, ఎంత శ్రద్ధగా నేర్చుకుంటున్నారో వివరించారు. వేదపండితులు తెలంగాణ సంస్కృత భారతి అధ్యక్షుడు బ్రహ్మశ్రీ నరేంద్ర కాప్రే సమ్మేళనం వైశిష్ట్యాన్ని వివరించారు. ప్రదర్శనలో 29 రకాల 930 వస్తువులను ప్రదర్శించారు. కార్యక్రమంలో అఖిల భారత బాలకేంద్ర ప్రముఖులు ఉపద్రష్ట వెంకటరమణమూర్తి, ప్రొఫెసర్ నీలకంఠం, అఖిలభారత సహసంఘటన ప్రముఖులు దత్తాత్రేయ వజ్రెలి, చిలుకమర్రి లక్ష్మీనర్సింహచార్యులు పాల్గొన్నారు.



సంస్కృత సమ్మేళనం ప్రారంభోత్సవంలో పరమహంస పరివ్రాజకాచార్యులు మధవానందసరస్వతిస్వామి

బీజేపీ డివిజన్ అధ్యక్షుడిగా పోరెడ్డి రవీందర్‌రెడ్డి




రవీందర్‌రెడ్డి

చంపాపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడుగా ఉదయ్‌నగర్ కాలనీకి చెందిన పోరెడ్డి రవీందర్‌రెడ్డి రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి చేతుల మీదుగా రవీందర్‌రెడ్డి నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి శనివారం మాట్లాడుతూ తనను డివిజన్ అధ్యక్షుడుగా నియమించినందకుగాను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. బూత్ స్థాయి నుంచి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయనున్నట్లు అన్నారు.

బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా యోగిరాజ్

చంపాపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ రంగారెడ్డి జిల్లా(అర్బన్)కౌన్సిల్ సభ్యుడిగా చంపాపేట డివిజన్ మహంకాలమ్మతోటకు చెందిన బండారు యోగిరాజ్ నియమితులయ్యారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా యోగిరాజ్‌ను నియమిస్తూ బీజేపీ జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి నియామకపత్రం అందజేశారు. తనను కౌన్సిల్ సభ్యులుగా నియమించినందుకుగాను చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయనున్నట్లు యోగిరాజ్ పేర్కొన్నారు.



బండారు యోగిరాజ్

ఇంటర్ పరీక్షలకు ధైర్యంతో సంసిద్ధం కావాలి

- బోర్డు జాయింట్ సెక్రెటరీ జ్యోత్స్నరాణి

చాదర్‌ఘాట్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రానున్న ఇంటర్మీడియట్ పరీక్షలను విద్యార్థులు పండగలా జరుపుకోవాలి, ధైర్యంతో సంసిద్ధం కావాలని ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రెటరీ జ్యోత్స్నరాణి అన్నారు. శనివారం ఆమె మలక్‌పేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా విచ్చేసి తనిఖీ నిర్వహించారు. ఇంటర్ జూనియర్, సీనియర్ విద్యార్థులతో వేరువేరుగా సమావేశమయ్యారు. విద్యార్థులు పరీక్షల సమయంలోనే చదవడం మొదలు పెట్టవద్దని, క్లాస్‌లో లెక్చరర్ ఏరోజు పాఠం చెప్పగానే అదేరోజు చదువుకోవాలని, ఇలా ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే పరీక్షలు ఎప్పుడు నిర్వహించినా సంసిద్ధం అయ్యేందుకు అవకాశముందని జాయింట్ సెక్రెటరీ వివరించారు. ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులై ముందుగా తల్లిదండ్రులకు, తర్వాత కళాశాలకు గుర్తింపు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం కళాశాలలో పలు రికార్డులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ అరుణతోపాటు అధ్యాపకులు ఆమె వెంట ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రెటరీ జ్యోత్స్నరాణి

పనిదినాల్లో సినిమా షూటింగ్‌లకు అనుమతిస్తే ఊరుకోం

- వీఎం హోమ్ పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం

మన్సూరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పాఠశాల పనిదినాల్లో సినిమా షూటింగ్‌లకు అనుమతించొద్దని విక్టోరియా మెమోరియల్ హోమ్ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం హెచ్చరించింది. శ్రీరామ్‌వేణు దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మాతగా నితిన్, లాస్య హీరో హీరోయిన్లుగా నటిస్తున్న 'తమ్ముడు' సినిమాను ఐదు రోజుల అనుమతితో 13వ తేదీ నుంచి వీఎం హోమ్ పాఠశాలలో షూటింగ్ చేపడుతున్నారు. ఈ క్రమంలో పాఠశాల పనివేళలు ప్రారంభమైన ఐదవ రోజైన శనివారం సైతం షూటింగ్ చేపడుతుండడంతో విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఆ సంఘం అధ్యక్షుడు భీమగాని మహేశ్వర్‌గౌడ్, తెలంగాణ జనసమితి పార్టీ నాయకుడు పల్లె వినయ్‌కుమార్‌గౌడ్‌లు అక్కడికి చేరుకుని మాట్లాడుతూ పాఠశాల పనిదినాల్లో సినిమా షూటింగ్‌లకు అనుమతిస్తే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని అన్నారు. కార్యక్రమంలో వీఎం హోమ్ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు కె.సాగర్, కేవీ రంగారెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



వీఎం హోమ్‌లో షూటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

బౌన్సర్లను పెట్టి యథేచ్ఛగా షూటింగ్

వీఎం హోమ్ పాఠశాలలో పలు తరగతి గదులు, మరుగుదొడ్లను మూసివేసి విద్యార్థులు, పాఠశాల సిబ్బంది అటుగా వెళ్లకుండా ఇబ్బంది పడేలా బౌన్సర్లను పెట్టి యథేచ్ఛగా తమ్ముడు సినిమా షూటింగ్‌ను చేపట్టారు. విద్యార్థుల స్థితిగతులను తెలుసుకునేందుకు వెళ్లేందుకు ప్రయత్నించిన మీడియా ప్రతినిధులు, ఇతరులతోనూ బౌన్సర్లు దురుసుగా ప్రవర్తించిలోనికి రానివ్వకుండా అడ్డుకున్నారు.



ఎస్ఆర్ఎల్ కాలనీ ప్రధాన దారి పరిసరాలను పరిశీలిస్తున్న జడ్సీ హేమంత్ పాటిల్, కార్పొరేటర్ పవన్‌కుమార్

బాక్స్‌డ్రెయిన్ పనులను పునరుద్ధరించాలి

కొత్తపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ పరిధిలోని ఎస్‌ఆర్‌ఎల్‌కాలనీ దారిలో బాక్స్‌డ్రెయిన్ పనులను వెంటనే పునరుద్ధరించాలని ఎల్బీనగర్ జడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కార్పొరేటర్ పవన్‌కుమార్ కోరారు. శనివారం కార్పొరేటర్‌తో కలిసి ఎల్బీనగర్ జడ్సీ డివిజన్‌లోని ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ, నాగేశ్వర్‌నగర్, గాయిత్రీపురం, ఎస్‌ఆర్‌ఎల్‌కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ అర్థాంతరంగా ఆగిపోయిన తెలంగాణ పార్కు సుందరీకరణ పనులు పునరుద్ధరించాలని కోరారు. ఎస్‌బీహెచ్‌కాలనీ, భరత్‌నగర్, బాలాజీనగర్ తదితర కాలనీల్లో అంతర్గత దారులు పాడయ్యాయని, మరమ్మతు పనులు చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ పర్యటనలో డీసీ సుజాత, ఏఈ శ్రీనివాస్, డీఈ నవీన్‌కుమార్, పారిశుధ్య విభాగం డీఈ చందన, హార్టికల్చర్ అధికారి, ఏఈ సత్యనారాయణ, కాలనీల ప్రతినిధులు, సత్యనారాయణ, విజయభాస్కర్, మంచి రాజేష్, నాగేశ్వర్ పాల్గొన్నారు.



రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డికి సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న పలు కాలనీల ప్రజలు

ప్రజా సమస్యలను పరిష్కరిస్తా : మల్‌రెడ్డి రాంరెడ్డి

హయత్‌నగర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్‌కు వచ్చిన ఆయనకు పలు కాలనీల ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ అధికారులతో చర్చించి మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమ్మగూడ కౌన్సిలర్ కౌశిక ఐలయ్యతో పాటు ప్రజలు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో పూజలు

ఓల్డ్‌మలక్‌పేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ నూతన అధ్యక్షుడిగా నియామకమైన సతీష్‌సింగ్ శనివారం ఓల్డ్‌మలక్‌పేటలోని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు, కమిటీ సభ్యులు ఆయనకు పూలమాలలతో స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం సతీష్‌సింగ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో డివిజన్ అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర నాయకత్వానికి, డివిజన్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ పటిష్టత కోసం తనవంతు కృషిచేస్తానన్నారు. డివిజన్ అధ్యక్షుడిగా నియామకమై మొదటిసారి ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్, సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కోటేశ్వర్‌రావు, చౌకి రాజు, చీపురు రాజారావు, కె రాజు, ఎల్‌ఆర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



వడ్డెర సంఘం కమిటీ ప్రతినిధులతో బీఆర్‌ఎస్ నాయకుడు రాంచందర్

భరత్‌నగర్ -1, -2 వడ్డెర సంఘం కమిటీ

కొత్తపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ పరిధిలో శనివారం భరత్‌నగర్ -1, -2, రాజీవ్‌గాంధీనగర్, ఎన్టీఆర్‌నగర్ బస్తీల వడ్డెర సంఘం నూతన కమిటీ ఏర్పాటయింది. సంఘం అధ్యక్షుడిగా శివరాత్రి అశోక్, ఉపాధ్యక్షుడిగా మాదరం ఎల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా లింగయ్య, సంతోష్, వెంకన్న, రవి, యాదగిరి, వీరయ్య, రాజు, అంజయ్య, బాలరాజు వ్యవహరించనున్నారు. వడ్డెర ప్రజల సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు మామిడి రాంచందర్ సమావేశమయ్యారు. ఆయన వారిని అభినందించి శాలువాలతో సన్మానించారు.